04102024-DIS-06_Layout 1 10/4/2024 2:40 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

జమ్మూకశ్మీర్ ఎన్నికలు

జమ్మూకశ్మీర్‌లో పదేండ్ల తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికలు పలు రకాలుగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ ఎన్నికలను కశ్మీరీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని చెప్పాలి. ఒకరకంగా చెప్పాలంటే ఆర్టికల్ 370 రద్దు ద్వారా కశ్మీర్‌కు దఖలు పడిన ప్రత్యేక ప్రతిపత్తి రద్దు చేయడంపై ఈ ఎన్నికలను ప్రజాభిప్రాయ సేకరణగా భావించవచ్చు. ఈ ఎన్నికల్లో 63.45 శాతం ఓటింగ్ నమోదైంది. ఇది ఇటీవలి పార్లమెంట్ ఎన్నికల సగటు 57.89 కంటే ఎక్కువ. అంతేకాదు, 2008 అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన 61.01 కంటే ఎక్కువే. దక్షిణ కశ్మీర్‌లోని పుల్వామా, సోఫియాన్, కుల్గాం, ఉత్తర కశ్మీర్‌లోని బారాముల్లాల్లో ఓటింగ్ భారీగా పెరిగింది. దక్షిణ కశ్మీర్‌లో జమాతే ఇస్లామీ మద్దతుతో బరిలో నిలిచిన స్వతంత్ర అభ్యర్థులు, ఉత్తర కశ్మీర్‌లో బారాముల్లా ఎంపీ ఇంజినీర్ రషీద్ నేతృత్వంలోని అవామీ ఇత్తేహాద్ పార్టీ పోటీ కారణంగా పోలింగ్ శాతం పెరిగినట్టు అంచనా. 370 రద్దుతో ఓటుహక్కు పొందిన పాక్ కాందిశీకులు, వాల్మీకి తెగ ప్రజలు, గూర్ఖాలు ఈ ఎన్నికల్లో తొలిసారిగా తమ హక్కును వినియోగించుకోవడం విశేషం. వారి ఓటు నిర్ణయాత్మకం కావచ్చనే అంచనాలూ ఉండటం గమనార్హం.

కశ్మీర్ అస్తిత్వాన్ని సమూలంగా మార్చివేసిన బీజేపీ విధానాలకు ఈ ఎన్నికలు అగ్నిపరీక్ష లాంటివి. పదేండ్ల క్రితం పొత్తు పెట్టుకుని అధికారంలోకి వచ్చిన బీజేపీ, పీడీపీలు ఈసారి విడివిడిగా బరిలోకి దిగాయి. బీజేపీ చేతుల్లోకి కశ్మీర్ వెళ్లకుండా అడ్డుకోవాలనే లక్ష్యంతో ఎన్సీ, కాంగ్రెస్ జట్టు కట్టాయి. స్థానిక సమస్యలు, కూడు, గూడు లాంటి అంశాలపై కాకుండా ప్రత్యేక హోదా పునరుద్ధరణ, రాష్ట్ర హోదాను తిరిగి కల్పించడం లాంటి అంశాల మీదే ఎన్నికల ప్రచారం సాగింది. రాష్ట్ర విభజన తర్వాత లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా కేంద్రమే చక్రం తిప్పుతున్నది. ఇది సగటు కశ్మీరీకి ఏ మాత్రం నచ్చని అంశమని ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. ఒకవేళ ఈ ఎన్నికల్లో బీజేపీ గనుక గెలిస్తే ఆర్టికల్ 370 రద్దుకు ప్రజల మద్దతు ఉందని ప్రచారం చేసుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది. అదేవిధంగా ప్రజలు కోరుకుంటున్న రాష్ట్ర హోదా పునరుద్ధరణ దిశగా అడుగులు వేయవచ్చు. అలా కాకుండా హంగ్ ఏర్పడి అతిపెద్ద పార్టీగా బీజేపీ నిలిస్తే మాత్రం ఎలాగైనా అధికారం చేజిక్కించుకునేందుకు స్వతంత్ర అభ్యర్థులు, చిన్నాచితకా పార్టీలను తనవైపు తిప్పుకోవాల్సి ఉంటుంది.

అదే కాంగ్రెస్, ఎన్సీ కూటమి గెలిస్తే రాష్ట్ర హోదా పునరుద్ధరించకుండా కేంద్ర ప్రభుత్వం ఆలస్యం చేసే అవకాశం ఉంటుంది. అదే జరిగితే రాష్ట్ర హోదాతో పాటు ఆర్టికల్ 370 కోసం డిమాండ్లు ఊపందుకోవచ్చు. ఆర్టికల్ 370 పునరుద్ధరణ చేయాలంటూ కూటమిలోని ఎన్సీ డిమాండ్ చేస్తుండగా, కాంగ్రెస్ కేవలం రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నది. ఈ కారణంగా కూటమి గెలిచినా ఎన్నాళ్లు అధికారంలో ఉంటుందో చెప్పలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో జమాతే ఇస్లామీ, ఇంజినీర్ రషీద్, పీడీపీ మద్దతు కీలకం. ఏదేమైనప్పటికీ కశ్మీరీలు అధిక సంఖ్యలో వచ్చి ఓటింగ్‌లో పాల్గొనడం అభినందించాల్సిన విషయం. ఎలాంటి అల్లర్లు జరగకుండా, రీపోలింగ్ లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు ముగియడం ప్రజాస్వామ్యానికి శుభసూచకం.

కదలని బీసీ డిక్లరేషన్

నర్సన్ బద్రి

2023, నవంబర్ 10 నాడు కామారెడ్డి పట్టణం వేదికగా ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ఆ పార్టీ గద్దెనెక్కేందుకు ఎంతో ఉపయోగపడింది. 2023 మేలో కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపునకు వ్యూహకర్తగా పనిచేసిన సునీల్ కనుగోలు ఇచ్చిన సలహాల్లో ఇదొకటి. కర్ణాటకలో కన్నా తెలంగాణలో బీసీ జనాభా ఎక్కువ ఉన్నందున బీసీల కోసం ఎన్నికల ముందు ఒక ప్రత్యేక ప్యాకేజీ ప్రకటన అవసరాన్ని ఆయన సూచించారు. దాని ఫలితంగా ఆ పార్టీకి బీసీ ఓట్లు పెరిగాయనవచ్చు. అయితే బీసీ డిక్లరేషన్‌లోని హామీలేవీ ఇంతవరకు ఆ వర్గాలకు దక్కలేదు.

అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో బీసీ కులగణన చేయించి, ఆ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్ల పెంపు కూడా జరుగుతుందని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీలకున్న 23 శాతం కోటాను 42 శాతానికి పెంచుతామన్నారు. అధికారంలోకి వచ్చి 10 నెలలైనా ఇంతవరకు అసెంబ్లీలో ఆ పెంపు బిల్లు ప్రవేశపెట్టలేదు. ఇందు కోసం రూ.150 కోట్లు ఫిబ్రవరిలో మంజూరైనప్పటికీ పని మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. బీసీ కమిషన్‌కు కొత్త కార్యవర్గం నియామకమై నెల రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి వారికి ఎలాంటి మార్గదర్శకాలు రానందున మరింత కాలయాపన జరుగుతున్నది.

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ విషయంలో ప్రభుత్వం మనసులో ఏముందో అనే అనుమానం కూడా కలుగుతున్నది. కోర్టు ఆదేశాల మేరకు డిసెంబర్‌లోగా కులగణన, బీసీలకు రిజర్వేషన్ల పెంపు, స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లు జరిగే అవకాశాలున్నాయా అనిపిస్తున్నది. ఎందుకంటే, ఈ దిశగా ప్రభుత్వ చర్యల్లో వేగం కావలసినంతగా కానరావడం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన స్థానాల్లో కూడా పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు తగ్గిపోవడంతో కాంగ్రెస్ పార్టీకి ఒక భయం పట్టుకొన్నట్టుంది. ఏడాది తిరగకముందే గ్రామ స్థాయిలో పరాభవం ఎదురైతే పాలన ముందుకు సాగడం కష్టమైపోతుంది. అధిష్ఠానం దృష్టిలో రేవంత్ గ్రాఫ్ కూడా పడిపోవచ్చు. కాంగ్రెస్ పాత కాపులు తిరగబడవచ్చు. వీటన్నిటి కన్నా ఎలాగోలా కోర్టు ముందు మోకరిల్లి వీలైనంత కాలం సాగదీయాలని ముఖ్యమంత్రి ఆలోచన కావచ్చు.

జనవరి 31తో రాష్ట్రంలో సర్పంచుల పదవీకాలం ముగిసి, రాష్ట్రంలో గత తొమ్మిది నెలలుగా పంచాయతీరాజ్ వ్యవస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల చేతుల్లో కొనసాగుతున్నది. మాజీ సర్పంచుల పనుల బిల్లులు పూర్తిగా చెల్లింపు కాలేదు. వారు ఈ మధ్య గవర్నర్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. స్థానిక సంస్థల్లో పాలకవర్గం లేనందువల్ల సమావేశాలు, తీర్మానాలు జరగక గ్రామాభివృద్ధి కుంటుపడుతున్నది. మరోవైపు స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు లెక్క తప్పుతాయి. కులగణన, రిజర్వేషన్ల పెంపు కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ బీసీలకు ఇచ్చిన ప్రధాన హామీ. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో తీర్చుతామన్న మాట ఏడాదిలో కూడా సాకారమయ్యేలా లేదు. బీసీ డిక్లరేషన్‌లో పేర్కొన్న మరిన్ని హామీల గురించి కూడా ఇక్కడ ప్రస్తావించుకోవాలి.

ఏడాదికి రూ.20 వేల కోట్లు బీసీల సంక్షేమానికి ఖర్చు చేస్తామన్నారు. ఈ బడ్జెట్‌లో మాత్రం బీసీ సంక్షేమానికి రూ.9,200 కోట్లు మాత్రమే ప్రతిపాదించారు. బీసీ యువతకు వ్యాపారాలు, ఉన్నత చదువుల కోసం రూ.10 లక్షల వరకు వడ్డీ లేని, థర్డ్ పార్టీ గ్యారెంటీ లేని రుణాలు ఇస్తామని అన్నారు. ఈ అప్పు బ్యాంకుల ద్వారానా, సర్కారే ఇస్తుందా అనే స్పష్టత లేదు. రూ.50 కోట్లతో జిల్లాకొక ప్రొ.జయశంకర్ ఐక్యత భవన్‌ను నిర్మించి వాటిలో స్టడీ సర్కిల్, లైబ్రరీ, క్యాంటీన్ ఏర్పాటు చేస్తామన్నారు. వృత్తుల వారికి వృద్ధాప్య పింఛన్ వయసును 57 నుంచి 50కి తగ్గించి, ఇప్పటికే గౌడ, నేత వృత్తుల వారికి ఇస్తున్న ఈ పింఛన్‌ను మంగలి, వడ్రంగి, చాకలి, కమ్మరి, కంసాలి వృత్తుల వారికి కూడా వర్తింపజేస్తామని డిక్లరేషన్ ఇచ్చారు. వీటి అమలు కోసం బీసీ నేతలు పార్టీలు, రాజకీయాలకతీతంగా ఐక్యమై ప్రభుత్వాన్ని నిలదీయవలసిన అవసరం ఉన్నది.

సంకటాలు తగిలించుకొని..!

సంకటాలు తగిలించుకొని మీసాలు పీక్కుంటే ఏం లాభం?.. అనేది పెద్దల ఉవాచ. లోకపు తీరుతెన్నులు సుదీర్ఘకాలంగా చూసిన అనుభవం ఆ వ్యాఖ్యలో ఉన్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇది సరిగ్గా సరిపోతుంది. తమకు ఇంటా వంటా అలవాటు లేని చెరువుల రక్షణ, కాలుష్య నివారణ అంటూ బయల్దేరి దాన్ని ఎలా చేయకూడదో అలా చేసి.. ఆఖరికి మింగాకక్కాలేని పరిస్థితిని తెచ్చుకున్నారు. మొన్న హైకోర్టు వాయింపులు విన్న తర్వాత సర్కారులో మల్లగుల్లాలు మొదలయ్యాయంటున్నారు. ఏమైనా తగిలించుకున్నంత తేలిక్కాదు, వదిలించుకోవడం.



పాయింట్ బ్లాంక్

- సవాల్ రెడ్డి

తెలంగాణ రాకముందు అనుకుంటా ఓ పాత్రికేయుడు తన వారాంతపు కాలమ్‌లో 'తెలంగాణ పునర్నిర్మాణం అంటే ఇపుడున్నవన్నీ కూల్చేస్తారా?' అని ప్రశ్నించాడు. సరే.. ఆయన అక్కసు ఆయనది! ఆ మాటకొస్తే అక్కసు అనే పదానికి ఆయనే ఓ బ్రాండ్ అంబాసిడర్!! అయినా తెలంగాణ వచ్చింది. వచ్చిన తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం ఏం కూల్చిందో.. ఏం నిర్మించిందో.. పునర్నిర్మాణం అంటే ఏమిటో ప్రజలకు, అలాగే సదరు పాత్రికేయుడికి కూడా; అనేక రూపాల్లో అనుభవంలోకి వచ్చి ఉంటుంది. కేసీఆర్ చేపట్టిన పునర్నిర్మాణంలో ఏదీ కూల్చకపోగా రాష్ట్రంలో విద్యుత్ వ్యవస్థ, జలవనరుల కల్పన, తాగునీరు, సాగునీరు, వ్యవసాయ స్థిరీకరణ, రహదారుల నిర్మాణం, ఐటీ రంగ అభివృద్ధి, సీనియర్ సిటిజన్లకు భరోసా, ఉద్యోగస్థుల సంక్షేమం, చేతి వృత్తులకు చేయూత ఇలా అనేక రంగాలు దేశానికి ఆదర్శం అనే స్థాయిలో పునర్నిర్మాణం జరిగింది. మొన్నటికి మొన్న ప్రధాని మన్ కీ బాత్‌లో పేర్కొన్న పచ్చదనం పెంపు సహా ఇవాల్టికీ ఇక్కడ జరిగిన అభివృద్ధి ఇంకా వార్తల్లోకెక్కుతూనే ఉన్నది. ఎవరికి నచ్చినా, నచ్చకున్నా.. ఎవరెన్ని వంకర అర్థాలు తీసినా అదంతా ఒక సుజల.. సుఫల.. చరిత్ర.

పదేండ్ల తర్వాత ఇపుడు తెలంగాణలో జరుగుతున్నదేమిటి? హైదరాబాద్‌లో జరుగుతున్నదేమిటి? అపుడెపుడో ఆ పాత్రికేయుడు చెప్పిన కూల్చివేతల విధ్వంసకాండే కదా! దానికి చెరువుల రక్షణ, పర్యావరణ రక్షణ, కాలుష్య నివారణ అనే ట్యాగ్‌లైన్. ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వమే కర్కశంగా పేద ప్రజల జీవికను చిదిమివేసే, గూడు నుంచి తరిమేసే ప్రక్రియ. కూలిన శిథిలాలు, గుండెలవిసే పేదల రోదనలు.. కండ్లముందు గుండె బరువెక్కే దృశ్యాలు. ఇదే కేసీఆర్ హయాంలో జరిగి ఉంటే..

> **'ఇందుకేనా తెలంగాణ తెచ్చుకుంది?', 'ఇదేనా బంగారు తెలంగాణ?' అనే సొల్లు డైలాగులు చాలా చాలా వినిపించేవి. పచ్చ టీవీల్లో మేధావులు నెత్తి గోక్కుంటూ, ముక్కుచెవుల్లో వేళ్లు దూర్చుకుంటూ చాలా చాలా ప్రవచనాలు చెప్పేవారు. పచ్చ పత్రికల ఎడిట్ పేజీలు కన్నీటి జలపాతాలు కురిపించేవి. తమాషాగా ఇపుడు అవేం లేవు. సరికదా.. 'చాక్లెట్ తింటే జలుబు చేస్తుందమ్మా..!' అని చిన్న పిల్లలకు గారంగా చెప్పిన లీతిలో 'జాగ్రత్త రేవంత్... ఇలా చేయకూడదమ్మా!' అంటూ సుతిమెత్తని సలహాలు పరిచేస్తున్నాయి. ఇంకా పచ్చ పర్యావరణవేత్తలను రంగంలోకి దింపినట్టు లేదు.**

అయినా దబాయింపులు..!

కొత్త ఎద్దు పెండ ఇంటిల్లిపాదీ పోటీ పడి ఎత్తిపోస్తారని.. ఓ పూర్వకాలపు సామెత. కొత్త కదా ఆ మోజు ఉంటుంది. రాష్ట్రంలో మంత్రులకు కూడా ఇంకా అధికారం చేపట్టిన మురిపం పాతబడినట్టు లేదు. విమర్శ ఎదురైతే చాలు ఒంటికాలు మీద లేస్తున్నారు. ఈ విధ్వంసకాండపై జరుగుతున్నదంతా 'బిల్డర్లు ఆడుతున్న నాటకమని' భట్టిగారు భాష్యం చెబుతుంటే.. 'ఆక్రమణ చేస్తే బుల్డోజర్లు రావా?' అని శ్రీధర్‌బాబు గారు ఆవేశపడిపోతున్నారు. 'ఐదొందలు, ఆరొందలు ఇచ్చి మాట్లాడిస్తున్నార'ని కూడా అనేశారు. పొన్నం గారు సోషల్‌మీడియా.. కేసులు అంటూ ఆయన శైలిలో స్పందిస్తున్నారు. కోమటిరెడ్డి వారు మా నల్గొండ మూసీ కాలుష్యం కడిగేద్దామంటే బీఆర్ఎస్ వాళ్లు అడ్డం పడుతున్నారనేంత దాక పోయారు. మరి అదే నల్లగొండ ఫ్లోరైడ్ బారిన పడి జీవచ్ఛవమవుతుంటే కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందో! ఎలా ఆదుకుందో మాత్రం చెప్పలేదు. ఇక బాధితులతోనే 'ఆహా ఎంత బాగా కూల్చారో' అంటూ వాళ్ల సోషల్ మీడియా టీమ్ బైట్లతో బయటపడాలని సర్వశక్తులు ధారపోస్తున్నారు. కానీ వర్కవుటే కావడం లేదు. ఎరక్కపోయి ఇరుక్కున్న అధికారులదీ అదే సీను. 'మూసీ మార్కింగ్‌తో మాకు సంబంధం లేద'ంటూనే ఆ బాధ్యతలు చూసే దానకిశోర్‌గారితో కలసి రంగనాథ్‌గారు గంటన్నర పాటు హైడ్రా మీద వివరణలు ఇచ్చుకున్నారు. రెండింటికీ సంబంధమే లేకపోతే ఇద్దరూ కలిసి ప్రెస్ కాన్ఫరెన్స్ ఎందుకు పెట్టినట్టు అనే ప్రశ్నకు జవాబు లేదు. ఆ మాటకొస్తే హైకోర్టు లేవనెత్తిన ప్రశ్నలకు ప్రభుత్వం దగ్గర కూడా జవాబులు లేవు.

ఎవరి హయాంలో ఎన్ని ఆక్రమణలు?

పీఆర్ స్టంట్‌లు ప్రతిసారీ వర్కవుట్ కావు. చెరువుల ఆక్రమణల తొలగింపు, కాలుష్య నివారణ, ప్రక్షాళన అనే ఆదర్శ ట్యాగ్‌లు అంత తొందరగా ఒళ్లో వచ్చి వాలవు. ఈ ఆక్రమణలన్నీ ఏదో కేసీఆర్ హయాంలోనే జరిగినట్టు, మూసీ నది మొత్తం కేసీఆర్ ప్రభుత్వమే కాలుష్యమయం చేసినట్టు చిత్రీకరిద్దామనుకుంటే కుదరదు.

నగరంలోని చెరువుల ఆక్రమణ చరిత్ర, మూసీ కాలుష్య చరిత్ర ఇదే నగరంలో నివసించే ప్రజలకు తెలియదా? అసలు ఈ రాష్ట్రాన్ని దశాబ్దాల పాటు ఏలిందెవరు? నగరంలోని వేల కొద్దీ చెరువులన్నీ ఎవరి హయాంలో కబ్జాదారుల పాలయ్యాయి; అనే విషయం తెలియనంత అమాయకులా ప్రజలు? కేసీఆర్ ప్రభుత్వం 2020లో సేకరించిన వివరాల ప్రకారం తెలంగాణ వచ్చేనాటికి హెచ్ఎండీఏ పరిధిలో మాయమైనవి పోనూ మిగిలినవి 3,778 చెరువులు. జీహెచ్ఎంసీ పరిధిలోకి వచ్చే చెరువుల్లో సగానికిపైగా ఆక్రమణల్లోనే ఉన్నాయని ఆ సర్వేలో తేలింది. అందులో 350 చెరువుల ఆక్రమణ కేసులు కోర్టులో ఉన్నాయని కూడా తెలిసింది. మరి ఈ ఆక్రమణలన్నీ ఎవరి హయాంలో జరిగినట్టు? ఎవరి హయాంలో జరిగిన ఆక్రమణల మీద కోర్టులో వందలాది కేసులు పెండింగ్‌లో ఉన్నట్టు?

సమస్య ఏమిటి? పరిష్కారమేమిటి?

'వన్నెలమ్మను వంటకు పెడ్తే ఇంటిల్లిరాజులను ఉపాసం పండబెట్టిందని' తెలంగాణ సామెత. ఆరు గ్యారెంటీలు అని అదరగొట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ పథకాలు అమలుచేస్తారని ప్రజలు అనుకుంటే అవన్నీ పక్కనబెట్టి డ్రామాలు, డైవర్షన్లు మొదలుపెట్టారు. ఇంత విధ్వంసకాండ చేపట్టడానికి ప్రభుత్వం, మంత్రులు చెప్తున్న కారణం ఏమిటి? చెరువులు ఆక్రమించారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, కాలుష్య ప్రక్షాళన వగైరా. అసలు హైదరాబాద్ ప్రధాన సమస్య ఏమిటి? నగరంలో కురిసే వర్షపు నీరు ముంపు సమస్య లేకుండా బయటకు పోవడం. నిలిచే నీరు బయటకు వెళ్లాలంటే రెయిన్ డ్రెయిన్ నాలాలు విస్తరించాలి. అవసరమైన చోట నిర్మించాలి. అది వదిలేసి విధ్వంసాలకు దిగారు. లేదూ.. చెరువులను రక్షించడమే ప్రధానం అనుకుంటే ముందు ఆయా చెరువుల క్యాచ్‌మెంట్ ఏరియాల్లో ఇవాళ మారిన వాతావరణ పరిస్థితుల్లో నిజంగా అక్కడ వర్షపాతం గతంలో మాదిరిగానే ఉందా? అది ప్రవాహమై చెరువుల్లోకి చేరేంత స్థాయిలో ఉంటున్నదా? నగర విస్తరణలో భూ వినియోగంలో మార్పులు వచ్చాక ఎక్కడికక్కడ భూమి చదును చేయబడిన తర్వాత ఇపుడూ ఆనాటి పాత పరిస్థితే ఉందా? అనేది సమగ్రంగా సర్వే చేయాలి. నమ్మదగిన ప్రవాహం ఉందంటే అడ్డుగా ఉన్న నిర్మాణాలన్నీ తప్పకుండా తొలగించాలి. అలాకాకుండా గుడ్డిగా ఓ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, మూసీ ఫ్రంట్ అంటూ గీతలు గీసి ఆ పరిధిలో నిర్మాణాలన్నీ కూలిస్తే కలిగే ప్రయోజనం ఏమిటి? త్రిబుల్ వన్ జీవోయే దీనికి మంచి ఉదాహరణ. ఎలా నిర్ధారించారో తెలియదు గానీ, 500 చదరపు కిలోమీటర్ల మేర 84 గ్రామాలను ఈ జీవో కిందకు తెచ్చారు. అది 1996 నాటి జీవో. ఇవాళ 2024. ఈ సుదీర్ఘ కాలగమనంలో, మారిన పరిస్థితుల్లో పాతకాలపు వర్షపాతాలు, నీటి ప్రవాహాలు, గతంలో మాదిరిగా లేవనేది ప్రజల వాదన. అంతే కాదు, ఆ పరిధిలో భూ వినియోగంలో భారీ మార్పులు వచ్చాయంటున్నారు.

> **ఒకప్పుడు ఖాళీగా పడావుగా ఉన్న భూములు, బీళ్లు, మైదానాలు కూడా పంట పొలాలు, ఇతర రూపాల్లోకి మారాయంటున్నారు. గ్రామాలు కూడా బాగా విస్తరించాయని, పట్టణీకరణ ప్రభావం బాగా పెరిగిందంటున్నారు. అంతేకాదు, సాక్షాత్తూ ప్రభుత్వమే ఆ పరిధిలో రహదారులు, ఇతర నిర్మాణాలు చేసిందని కూడా చెప్తున్నారు. నగర విస్తరణకు ఈ ప్రాంత అభివృద్ధికి కూడా ఈ జీవో ప్రధాన అడ్డంకిగా మారిందంటున్నారు.**

పర్యావరణ రక్షణ అవసరమే. కానీ, అది గుడ్డి గుర్రం కాకూడదు. ప్రజల కోసం చట్టాలుంటాయి తప్ప, చట్టాల కోసం ప్రజలు కాదు. ఒకప్పుడు ఈ భూగోళమంతా చెట్లు, గుట్టలు, పుట్టలు, పశుపక్ష్యాదులతో నిండి ఉండేది. ఆది మానవుని ప్రయాణం అక్కడ ప్రారంభమైంది. ఆహార సంపాదనతో మొదలైన ఆ యాత్ర; సామూహిక జీవితం, వ్యవసాయ క్షేత్రాలు, స్థిర నివాసాల ఏర్పాటు, గ్రామాలు, నగరాల నిర్మాణం వరకు చేరడం మానవజాతి చరిత్రలో ఓ మజిలీ. అంతే కాదు, ప్రతి ప్రాచీన నగరమూ నదీ తీరాల్లోనే వెలిసింది. నదీ తీరాల్లోనే నాగరికత పర్విల్లింది. నదీ తీరాల చుట్టే మానవుని ఉనికి కొనసాగింది. జనావాసాలు పెరిగాయి. అందువల్ల ఆ నదులేం ఇంకిపోలేదు. ఎండిపోలేదు. అలా అని ప్రాచీన కాలపు నదులన్నీ ఏ మార్పు లేకుండా ఇప్పటిదాక సజీవంగా ఉన్నదీ లేదు. మన దేశంలోనే వేదాలు ఉద్భాటించిన సరస్వతి నది ఇపుడు లేదు. అది లేనంతమాత్రాన ప్రపంచం మునిగిపోనూ లేదు. ఈ భూగోళం, దాని ఉపరితలం, సమస్త భూగోళాన్ని ఆవరించుకున్న పర్యావరణం, రుతుపవన చక్రం కాలానుగుణంగా వచ్చే అన్ని మార్పులను తమలో ఇముడ్చుకొని సమన్వయపరుచుకుని ముందుకుసాగుతూనే ఉన్నాయి. ఇది వేల వేల ఏండ్ల అనుభవం.

> **అసలు చెట్టు కొట్టకుండా.. గుట్ట తవ్వకుండా.. రాళ్లు పగులకుండా, పుట్ట తీయకుండానే మానవ నాగరికత ముందుకుసాగిందా? వాటిని ముట్టకుండానే మానవ నివాసాల ఏర్పాటు జరిగిందా? మహా మహా పట్టణాలు, నగరాలు ఏర్పడ్డాయా? పండ్ల తోటలు, పంట పొలాలు, చెరువులు పుట్టుకువచ్చాయా? పరిశ్రమలు, గనులు, ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందా? మానవుని పురోగమనంలో ఏర్పడే అవసరాలు, జీవిక, సుఖ నివాసం, సురక్షిత సామూహిక జీవనం, పురోగమనం సాధించడానికి అనుగుణంగా మానవుడు ప్రకృతిని వాడుకోవడం, ప్రకృతికి అనుగుణంగా మానవుడు మారడం రెంటినీ సమతుల్యం చేసిన తీరే నాగరికత. ప్రపంచవ్యాప్తంగా నగరీకరణ వేగంగా జరుగుతున్న సమయంలో నగరాల మీద జనసాంద్రత ఒత్తిడి తీవ్రమవుతున్న సమయంలో ఓ గిరి గీసుకొని కూర్చోవడం ప్రాక్టికల్‌గా సాధ్యపడేదేనా? అనేదీ ఆలోచించాల్సిందే!**

గుడిసెలు వేసి ఆక్రమించిందెవరు?

పేద ప్రజలు అనే సాకును అడ్డం పెట్టుకొని నగరంలో ఎక్కడ పడితే అక్కడ వందల గుడిసెలు వేసి అడ్డగోలు ఆక్రమణలు చేసిన ప్రఖ్యాత కాంగ్రెస్ నాయకుడెవరో, ఆ పనులు చేసినందుకు ఆయన ఏ పేరుతో ఫేమస్ అయ్యాడో ప్రజలకు తెలియదా? ఆయన కారణంగా నగరంలో ఎన్ని ప్రాంతాల్లో భూములు వివాదాస్పదమయ్యాయో తెలియదా? ఆయనొక్కడేనా? రామంతాపూర్ చెరువు ఎవరి హయాంలో ఎవరు ఆక్రమించారో అక్కడి ప్రజలకు తెలియదా? మూసీ మత్తడి నాలా మీద ఆక్రమణలు ఎవరు చేశారో తెలియదా? ఎవరి పాలనలో నాలాలు పిల్ల కాల్వల కన్నా అధ్వాన్నంగా మారాయో తెలియదా? అలాంటి అనేక చెరువుల ఆనవాలు కూడా మిగలకుండా మింగిందెవరో.. చెత్తపోసి.. మట్టిని నింపి ఒక్కో చెరువును ఎలా ఆక్రమించుకుంటూ వచ్చారో ఎక్కడికక్కడ ప్రజలు ఇప్పటికీ కథలు కథలుగా చెప్పుకుంటూనే ఉన్నారు. ఇవన్నీ తెలంగాణ రాకముందు జరిగినవే.

పర్యావరణం అంటే కేవలం చెరువులేనా?

పర్యావరణ రక్షణ అంటే కేవలం నీటి వనరుల రక్షణే కాదు. కొండలు, గుట్టలు, అడవులు కూడా రక్షించాలి. వాయు కాలుష్యం కూడా నివారించాలి. తమాషా ఏమిటంటే నగరాల్లో నీటి కుంటల రక్షణ పేరిట గగ్గోలు పెట్టే పాత్రికేయ మేధో సమూహాలు.. అటవీ ప్రాంతాల్లో పోడు వ్యవసాయం చేసుకునేవారికి మాత్రం పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తాయి. అనేక ఏండ్లుగా సాగు చేస్తున్నారని సపోర్టింగ్ సర్టిఫికెట్లు కూడా ఇస్తాయి. చెరువుల ఆక్రమణ పర్యావరణ విధ్వంసమే అయినపుడు అడవుల నరికివేత మాత్రం విధ్వంసం ఎందుకు కాదు? అంటే వారి దగ్గర జవాబుండదు. ఖమ్మం జిల్లాలో అయితే పోడు భూములకు పట్టాలు అనేది చాలామంది నాయకులకు ఒక జీవితకాలపు ఆదాయ మార్గంగా మారుతున్న వైనాన్ని మాత్రం పొరపాటుగా ఈ సమూహాలు ఎత్తిచూపవు. తెలంగాణ రాకముందే గిర్‌గ్లానీ కమిషన్ ఖమ్మం జిల్లా సహా రాష్ట్రంలో ఎంత అడవి ఎలా అన్యాక్రాంతమైందో ఒక నివేదిక కూడా ఇచ్చింది. అందులో సింహభాగం ఖమ్మం జిల్లా అడవుల అన్యాక్రాంతంపైనే చర్చించింది. తెలంగాణ వచ్చిన నాటికి కాగితాల మీద ఉన్న అడవులకు క్షేత్రస్థాయి వాస్తవాలకు పొంతనే లేదు. మరి ఆ అడవంతా ఎవరు మింగేసినట్టు? ఎవరి హయాంలో మింగేసినట్టు? ఇక కొండలు, గుట్టల పరిస్థితి ఏమిటనేది అందరి అనుభవంలో ఉన్నది. మన కండ్ల ముందే ఎన్ని గుట్టలు మాయమయ్యాయో చూశాం. అలా గుట్టలను క్వారీలకు లీజు ఇవ్వడం అనే జీవో ఎప్పుడు ఎవరి హయాంలో వచ్చింది? అందరికీ తెలుసు.

కహానీల కాంగ్రెస్..

చెరువులు- ఆక్రమణలు-కాలుష్యం- ప్రక్షాళన అంటూ అలవాటు లేని భారీ డైలాగులు వల్లిస్తున్న కాంగ్రెస్ పార్టీ చెప్పాల్సిన జవాబు ఒకటుంది. కాకతీయులు, కుతుబ్‌షాహీల కాలం నుంచి తెలంగాణవ్యాప్తంగా నిర్మించిన సముద్రాల్లాంటి చెరువులన్నీ ఎవరి హయాంలో ఆనవాళ్లు లేకుండా ధ్వంసమైపోయాయి? ఎక్కడికక్కడ ఆ చెరువులను కబ్జాలు పెట్టింది ఏ పార్టీ నాయకులు? చిన్న నీటిపారుదల శాఖను పట్టించుకోకుండా చెరువులకు మరమ్మతులే లేకుండా గాలికి వదిలేసిన అసమర్థ పాలకులెవరు? అసలు కాంగ్రెస్ పాలనలో ఏ చెరువును బతుకనిచ్చారు. ఏ చెరువును మిగలనిచ్చారు. రాష్ట్రంలో సింహభాగం బస్‌స్టాండ్‌లన్నీ చెరువుల్లో కట్టినవే. కరీంనగర్ బస్టాండ్, కలెక్టరేట్ కట్టింది చెరువులో కాదా? సిరిసిల్ల బస్ డిపో, బస్ స్టాండు కట్టింది చెరువులో కాదా? నగరంలోని ఎంజీబీఎస్ బస్టాండు మూసీ నది మధ్యలో కట్టారు కదా! జీహెచ్ఎంసీని హుస్సేన్‌సాగర్ నాలా మీదే కట్టారు కదా? ఎవరు కట్టారో, ఎవరు ప్రారంభించారో శిలాఫలకాల మీద సజీవంగానే ఉంది.

> **ఇలా లెక్కపెడుతూ పోతే పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, హాస్టళ్లు ఇలా అన్నిటికన్నీ ప్రభుత్వాల నిర్మాణాలే, నిర్వాకాలే. వీటన్నిటికీ ఎవరు బాధ్యత వహిస్తారు? అలాగే పచ్చని పంట పొలాలు పర్యావరణ రక్షణ కాదా? మరి ట్రిపుల్ ఆర్ పేరిట వేల ఎకరా